08122024-DIS-14_Layout 1 12/8/2024 4:31 AM Page 1



# బిలియనీర్స్ @ భారత్

**185 మందితో ప్రపంచ జాబితాలో మూడో స్థానం • 2024లో 905 బిలియన్ డాలర్లకు సంపద**

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: శ్రీమంతులు అడ్డాగా భారత్ మారిపోతున్నది. ప్రతియేటా దేశవ్యాప్తంగా బిలియనీర్లు గణనీయంగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరానికిగాను భారత్‌లో 185 మంది ఆగర్భ శ్రీమంతులు ఉన్నట్లు యూబీఎస్ తన నివేదికలో వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే సంపన్న వర్గాలు 21 శాతం మంది పెరిగారని, వీరి మొత్తం సంపద 905.6 బిలియన్ డాలర్లు లేదా రూ.75.19 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నదని పేర్కొంది. నికరంగా వీరి సంపద 42 శాతం ఎగబాకిందని తెలిపింది. ప్రపంచ దేశాల శ్రీమంతుల జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నదని వెల్లడించింది. 835 మందితో అమెరికా తొలి స్థానంలో నిలువగా, ఆ తర్వాతి స్థానంలో చైనా 427 మంది ఉన్నట్లు యూబీఎస్ తన తాజా బిలియనీర్ల నివేదికలో తెలిపింది. ప్రస్తుత సంవత్సరంలో కొత్తగా 32 మంది బిలియనీర్ల జాబితాలోకి చేరారని తెలిపింది. 2015 నుంచి శ్రీమంతుల సంఖ్య 123 శాతం చొప్పున పెరగడం విశేషం. కుటుంబ వ్యాపారాలు వారీ సంపద పెరగడానికి కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా భారత్‌లో ఇంచుమించు అన్ని వ్యాపారాల్లో కుటుంబ బిజినెస్‌లు అధికంగా ఉన్నాయని వెల్లడించింది.



### చైనాలో తగ్గుముఖం

అగ్రగామి దేశాలైన అమెరికా, భారత్‌లో బిలియనీర్లు పెరుగుతుండగా, అదే చైనాలో మాత్రం తగ్గుముఖం పడుతున్నారు. చైనాలో కుబేరుల సంఖ్య 93 మంది తగ్గారని నివేదిక పేర్కొంది. మొత్తం సంపద 1.8 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.4 ట్రిలియన్ డాలర్లకు పడిపోయింది. కానీ, అమెరికాలో బిలియనీర్ల సంపద 4.6 ట్రిలియన్ డాలర్ల నుంచి 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. మరోవైపు, 2015లో అంతర్జాతీయంగా 1,757 మంది బిలియనీర్లు ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 2,682కి చేరుకున్నారు. మొత్తంగా వీరి సంపద 6.3 ట్రిలియన్ డాలర్ల నుంచి 14 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2015 నుంచి 2020 వరకు బిలియనీర్ల సంపద 10 శాతం పెరగగా, 2020 నుంచి ఒక్క శాతానికి పరిమితమైందని తెలిపింది. గడిచిన పదేండ్లలో టెక్ బిలియనీర్లు భారీగా సంపదను సృష్టించారని, 2015లో 788.9 బిలియన్ డాలర్లుగా ఉన్న వీరి సంపద, 2024 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, ఫిన్‌టెక్, 3డీ ప్రింటింగ్, రోబోటిక్స్ వంటి విభాగాలు దూసుకుపోవడం వీరికి కలిసొచ్చింది. అలాగే పారిశ్రామికవేత్తల సంపద కూడా 480.4 బిలియన్ డాలర్ల నుంచి 1.3 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, రియల్ ఎస్టేట్‌కు చెందిన కుబేరుల సంపద కూడా 534 బిలియన్ డాలర్ల నుంచి 692.3 బిలియన్ డాలర్లకు చేరింది.

## ఆర్థిక అసమానతలతో ఎఫ్‌ఎంసీజీకి దెబ్బ

పట్టణాల్లో ఆర్థిక అసమానతల మధ్య అంతరం అంతకంతకు పెరుగుతున్నది. ఒకవైపు మధ్యతరగతి కుటుంబాలు తగ్గిపోతుండగా, మరోవైపు సంపన్న వర్గాలు అంతకంతకు పెరుగుతున్నారని నివేదిక వెల్లడించింది. 2019తో పోలిస్తే 2024లో సంపన్న వర్గాలు 86 శాతం మంది పెరగగా, ఇదే సమయంలో దిగువ, దిగువ మధ్యతరగతి కుటుంబాలు 25 శాతం తగ్గుముఖం పట్టారు. ఈ ప్రభావంతో ఎఫ్‌ఎంసీజీ రంగంపై తీవ్ర స్థాయిలో ప్రభావం చూపుతున్నదని కాంతార ఇండియా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. లగ్జరీ, మధ్యతరగతి కుటుంబాల మధ్య పెరుగుతున్న అంతరంతో ఎఫ్‌ఎంసీజీ అమ్మకాలు భారీగా పడిపోయాయని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారి ఆదాయం తగ్గుముఖం పడుతుండటంతో వినియోగదారులు విశ్వాసం సన్నగిల్లుతున్నదని, దీంతో పట్టణ ప్రాంతాల్లో అమ్మకాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో సేల్స్ గణనీయంగా పడిపోయాయని ఇన్‌సైట్స్, దక్షిణాసియా ఎండీ సౌమ్య మోహంతీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే అమ్మకాలు గణనీయంగా తగ్గాయని దేశీయ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజాలైన హెచ్‌యూఎల్, బ్రిటానియా, టాటా కన్స్యూమర్ వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. పట్టణాల్లో సంపన్న వర్గాలు పెరిగినప్పటికీ కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని, అదే గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం తగ్గుముఖం పట్టినప్పటికీ గత త్రైమాసికంలో ఇక్కడ అమ్మకాలు పెరిగాయని పేర్కొన్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



అమీర్‌పేట్, డిసెంబర్ 7 : మహిళా పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తున్నదని ఉపముఖ్యమంత్రి డాక్టర్ మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (టెక్కీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మహిళా పారిశ్రామికవేత్తలు, మహిళా సంఘాలచే రూపొందించిన ఉత్పత్తుల ప్రదర్శనను మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డీ సీతక్కతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. సౌరశక్తి విద్యుత్ యూనిట్ మొదలు వస్త్ర, ఆహార, ఆరోగ్యం వంటి 17 విభాగాలకు చెందిన 70 పైగా స్టాళ్లు కొలువుదీరాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. మహిళా పారిశ్రామికవేత్తలు రూపొందిస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తున్నదని, ఇందుకోసం ప్రతి యేటా వడ్డీ లేని రుణంగా రూ.20 వేల కోట్ల ఆర్థిక చేయూతను మహిళల కోసం వెచ్చించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఆ విధంగా వచ్చే ఐదేండ్లలో రూ.లక్ష కోట్లతో రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఆర్థిక ప్రగతి బాటలో పయనించి కోటీశ్వరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రకృతి సహజమైన వస్తువుల వినియోగంతో మహిళలు రూపొందించిన ఈ ఉత్పత్తులకు డిమాండ్ నెలకొన్నదని, మహిళలు ఈ తరహా ఉత్పత్తుల తయారీని మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం ద్వారా అందివస్తున్న వడ్డీలేని రుణాలను అందిపుచ్చుకోవాలని, తాము ఉపాధి పొందుతూ మరింత మందికి ఉపాధి కల్పిస్తున్న తీరు ఆదర్శమని సీతక్క చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ్రు శోభారాణి, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత హాజరయ్యారు.




## సువెన్ ఫార్మా చేతికి అమెరికా సంస్థ!

హైదరాబాద్, డిసెంబర్ 7: రాష్ట్రానికి చెందిన సువెన్ ఫార్మాస్యూటికల్..అమెరికా కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న ఎన్‌జే బియో ఇండస్ట్రీలో మెజార్టీ వాటాను కొనుగోలు చేయబోతున్నది. 64.4 మిలియన్ డాలర్లతో(రూ.500 కోట్లకు పైమాటే) ప్రింజెక్షన్, ఎన్‌జే బియోలో 56 శాతం వాటాను కొనుగోలు చేస్తున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ లావాదేవీ ఏడీసీ వంటి అభివృద్ధి చెందుతున్న పద్దతుల్లో ఎండ్-టు-ఎండ్ సొల్యూషన్‌లను అందించే టెక్నాలజీకి అనుగుణంగా ఉన్నదని సువెన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వివేక్ శర్మ తెలిపారు. ఈ ఒప్పందం ఈ నెల చివరినాటికి పూర్తికాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు.

# అడిలైడ్‌పై ఆసీస్ పట్టు

**ట్రావిస్ హెడ్ శతక దూకుడు • ఆసీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగుల ఆధిక్యం**

**కంగారూ పేసర్ల ధాటికి భారత టాపార్డర్ విలవిల • రెండో ఇన్నింగ్స్‌లో 128/5**



**సంక్షిప్త స్కోర్లు:**

భారత్ తొలి ఇన్నింగ్స్: 180 ఆలౌట్
ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 87.3 ఓవర్లలో 337 ఆలౌట్ (హెడ్ 140, లబూషేన్ 64, బుమ్రా 4/61, 4/98) భారత్ రెండో ఇన్నింగ్స్: 24 ఓవర్లలో 128/5 (పంత్ 28 నాటౌట్, గిల్ 28, కమిన్స్ 2/33, బొలాండ్ 2/39)

హెడ్(140)

అడిలైడ్: గులాబీ టెస్టుపై భారత్ పట్టు కోల్పోతోంది! అడిలైడ్ ఓవల్ వేదికగా శుక్రవారం మొదలైన రెండో టెస్టులో బంతితో పాటు బ్యాట్‌తోనూ రాణిస్తున్న ఆతిథ్య ఆస్ట్రేలియా రెండో రోజూ పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించి ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరుకుంది. భారత్‌కు కొరకరాని కొయ్య అయిన స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ (141 బంతుల్లో 140, 17 ఫోర్లు, 4 సిక్సర్లు) శతక దూకుడుతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 87.3 ఓవర్లలో 337 పరుగులు చేసింది. దీంతో ఆ జట్టుకు 152 పరుగుల కీలక ఆధిక్యం దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన టీమ్‌ఇండియా బ్యాటింగ్‌లో మళ్లీ తడబడటంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 128 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రిషభ్ పంత్ (28 నాటౌట్), నితీశ్ రెడ్డి (15 నాటౌట్) క్రీజులో ఉండగా భారత్ ఇంకా 29 పరుగులు వెనుకంజలో ఉంది. ఆసీస్ పేస్ త్రయం కమిన్స్ (2/33), బొలాండ్ (2/39), స్టార్క్ (1/49) ధాటికి భారత టాపార్డర్ విలవిల్లాడింది. మూడో రోజు ఆటలో భారత ఆశలన్నీ పంత్, నితీశ్ మీదే ఉన్నాయి.

### హెడ్ దూకుడు

ఓవర్ నైట్ స్కోరు 86/1తో రెండో రోజు ఆరంభించిన ఆసీస్.. ఆట మూడో ఓవర్లోనే మెక్‌స్వీని (39) వికెట్‌ను కోల్పోయింది. బుమ్రా (4/61) మరోసారి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. కొద్దిసేపటికే అతడు ప్రమాదకర స్టీవ్ స్మిత్ (2)నూ వెనక్కి పంపాడు. కానీ లబూషేన్ (64), లోకల్ హీరో హెడ్ భారత బౌలర్లను నిలువరించారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 65 పరుగులు జోడించారు. హెడ్ ఆదినుంచే దూకుడుగా ఆడగా లబూషేన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. ఈ ఇద్దరూ హర్షిత్ రాణాను లక్ష్యంగా చేసుకుని పరుగులు రాబట్టారు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన నితీశ్ (1/53).. ఈ భాగస్వామ్యాన్ని విడదీశాడు. లబూషేన్ నిష్క్రమించినా హెడ్ దూకుడు ఆపలేదు. సిరాజ్ బౌలింగ్‌లో బౌండరీతో 63 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేసుకున్న హెడ్.. టీ విరామం మరింత జోరు పెంచాడు. మిచెల్ మార్ష్ (9), అలెక్స్ కేరీ (12) విఫలమైనా అప్పటికే క్రీజులో కుదురుకున్న అతడు.. వన్డే తరహా ఆట ఆడాడు. రాణా వేసిన వరుస ఓవర్లలో రెండేసి బౌండరీలతో 90ల లోకి వచ్చిన అతడు.. అశ్విన్ బౌలింగ్‌లో సింగిల్ తీసి 111 బంతుల్లో శతకాన్ని సాధించాడు. సెంచరీ అనంతరం దూకుడు పెంచిన హెడ్.. సిరాజ్ 82వ ఓవర్లో 4, 6 బాదాడు. కానీ అదే ఓవర్లో నాలుగో బంతికి క్లీన్‌బౌల్డ్ అవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.

### భారత్.. అదే కథ!

తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనప్పటికీ పెర్త్ టెస్టు మాదిరిగా పుంజుకుంటుందనుకున్న భారత్.. అడిలైడ్‌లో మాత్రం ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయింది. కేఎల్ రాహుల్ (7)ను నాలుగో ఓవర్లోనే ఆసీస్ సారథి కమిన్స్ ఔట్ చేయడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. 31 బంతుల్లో 4 ఫోర్లు బాది 24 పరుగులు చేసిన యశస్వీ జైస్వాల్‌ను బొలాండ్ బోల్తా కొట్టించాడు. కోహ్లీ (11) కూడా అతడి బౌలింగ్‌కే బలై నిరాశపరిచాడు. గిల్ (30 బంతుల్లో 28, 3 ఫోర్లు) కాసేపు ప్రతిఘటించినా స్టార్క్ అద్భుత బంతితో అతడిని వెనక్కి పంపించాడు. భారీ ఆశలు పెట్టుకున్న కెప్టెన్ రోహిత్ శర్మ (6) మరోసారి విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో భారత్ ఆశలు నిలవాలంటే మూడో రోజు పంత్, నితీశ్ అద్భుతాలు చేయాల్సిందే!



రోహిత్ (6)

## ఏషియన్ త్రోబాల్ పోటీల్లో భారత్‌కు బంగారు పతకం

శామీర్‌పేట, డిసెంబర్ 7 : కాంబోడియాలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగిన పారా ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం లభించింది. పారా ఏషియన్ సెక్రటరీ వివేషన్ చేతుల మీదుగా టీమ్ వైస్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ సెక్రటరీ సింగారపు బాబు, దీరావత్ మహేశ్‌నాయక్‌లు బంగారు పథకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా లింగాపూర్ తాండాకు చెందిన దీరావత్ మహేశ్‌నాయక్ మాట్లాడుతూ.. కాంబోడియాకి వెళ్లేందుకు దాతల సహకారం కోసం నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించిన మాజీ మంత్రి కేటీఆర్.. రూ.1 లక్ష సహకారం అందించారని తెలిపారు. దివ్యాంగ సమాజానికి ముందుండి నడిపిస్తున్న కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నేడు సాధించిన ఈ విజయాన్ని కేటీఆర్‌తో పాటు తెలంగాణ ప్రజలకు అంకితం ఇస్తున్నామన్నారు.




## రిషిత ఖాతాలో మరో టైటిల్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంతర్జాతీయ స్థాయిలో వరుస టైటిల్స్‌తో అదరగొడుతున్న తెలంగాణ యువ టెన్నిస్ క్రీడాకారిణి బసిరెడ్డి రిషిత రెడ్డి మరోసారి సత్తా చాటింది. పూణెలో ఈనెల 2-7 తేదీలలో జరిగిన ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్ జూనియర్స్-జే100 గర్ల్స్ సింగిల్స్ టైటిల్‌ను ఆమె కైవసం చేసుకుంది. గర్ల్స్ సింగిల్స్ ఫైనల్‌లో రిషిత.. 6-2, 7-5తో అయో వటనబె (జపాన్)ను వరుస సెట్లలో చిత్తు చేసి మరో జూనియర్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. ఇది ఆమెకు వరుసగా మూడో టైటిల్ కావడం విశేషం.

## ఎనిమిదో డ్రా



సింగపూర్: డ్రాల పర్వం కొనసాగుతున్న ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో శనివారం పదో గేమ్‌లో సైతం అదే ఫలితం నమోదైంది. గుకేశ్, లిరెన్ మధ్య జరిగిన పదో గేమ్ కూడా డ్రా గా ముగిసింది. ఈ టోర్నీలో ఇది ఎనిమిదో డ్రా కాగా వరుసగా ఏడోది. 36 ఎత్తుల తర్వాత ఇరువురు ఆటగాళ్లు డ్రాకు అంగీకరించారు. ఈ టోర్నీ తొలి గేమ్‌ను లిరెన్ గెలుచుకోగా మూడో గేమ్‌ను గుకేశ్ నెగ్గాడు. ఆ తర్వాత ఇద్దరూ గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నా ఫలితాలలో మాత్రం మార్పు రావడం లేదు. పదో గేమ్ ముగిసిన తర్వాత ఇరువురూ 5 పాయింట్లతో సమానంగా నిలిచారు.

## ఫైనల్‌కు అన్మోల్

గువహటి: యువ భారత షట్లర్ అన్మోల్ ఖర్బ్ గువహటి మాస్టర్స్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. అన్మోల్‌తో పాటు పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్, మహిళల డబుల్స్‌లో అశ్విని - తనీషా జోడీ సైతం ఫైనల్స్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో 17 ఏండ్ల అన్మోల్.. 21-19, 21-17తో భారత్‌కే చెందిన మాన్సి సింగ్‌ను 40 నిమిషాల్లోనే ఓడించింది. మహిళల డబుల్స్‌లో మూడో సీడ్ భారత ద్వయం తనీషా-అశ్విని.. 21-14, 21-14తో షు లియాంగ్-వాంగ్ టింగ్ జి (చైనా)ను చిత్తు చేశారు. పురుషుల సింగిల్స్‌లో సతీశ్ కుమార్.. 13-21, 21-14, 21-16తో వాంగ్ జెంగ్ జింగ్ (చైనా)తో జరిగిన హోరాహోరి పోరులో విజయం సాధించాడు.

## ఇంగ్లండ్ అరుదైన ఘనత

**టెస్టు క్రికెట్‌లో 5 లక్షల పరుగులు చేసిన తొలి జట్టుగా రికార్డు**

**కొనసాగుతున్న జో రూట్ రికార్డుల జోరు**

వెల్లింగ్టన్: క్రికెట్ పుట్టినిల్లు ఇంగ్లండ్ టెస్టు ఫార్మాట్‌లో మరే జట్టుకూ అందని అరుదైన ఘనతను నమోదుచేసింది. న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న ఆ జట్టు రెండో రోజు దూకుడైన బ్యాటింగ్‌తో టెస్టులలో 5 లక్షల పరుగులు పూర్తి చేసిన తొలి జట్టుగా రికార్డులకెక్కింది. 147 ఏండ్ల ఇంగ్లండ్ క్రికెట్ చరిత్రలో ఆ జట్టుకు ఇది 1,082వ టెస్టు. నాటి నుంచి వెల్లింగ్టన్ టెస్టు దాకా సుమారు 717 మంది క్రికెటర్లు ఈ రికార్డులో పాలుపంచుకున్నారు. ప్రపంచ టెస్టు క్రికెట్ చరిత్రలో ఇంగ్లండ్ సమఉజ్జీలైన ఆస్ట్రేలియా (4,28,860 రన్స్), భారత్ (2,78,751) తదుపరి స్థానాల్లో ఉన్నాయి. బేసిన్ రిజర్వ్ వేదికగా కివీస్‌తో జరుగుతున్న ఈ టెస్టులో పలు రికార్డులు నెలకొల్పిన ఇంగ్లీష్ జట్టు.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 378/5 పరుగులు సాధించింది. ప్రస్తుతం ఆ జట్టు ఆధిక్యం 533 పరుగులు కాగా మరో మూడు రోజుల ఆట మిగిలిఉన్న ఈ మ్యాచ్‌లో కివీస్ కొండంత లక్ష్యాన్ని ఛేదించడం కష్టమే! అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 86/5తో రెండో రోజు ఆరంభించిన కివీస్.. 125 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఇంగ్లండ్‌కు 155 పరుగుల ఆధిక్యం లభించింది. ఇంగ్లండ్ బౌలర్లలో అట్కిన్సన్ (4/31) హ్యాట్రిక్ నమోదుచేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో జో రూట్ (73 నాటౌట్) మరోసారి హాఫ్ సెంచరీతో మెరిశాడు. టెస్టులలో అతడికి ఇది 65వ అర్ధ సెంచరీ. తద్వారా అతడు టెస్టులలో 35 శతకాలు, 65 అర్ధ శతకాలు సాధించిన నాలుగో క్రికెటర్ (సచిన్, కలిస్, పాంటింగ్ ముందున్నారు)గా నిలిచాడు.








Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.